క్లుప్తంగా

పంటలు త్వరగా ఒబ్బిడి చేసుకోవాలి

కిర్లంపూడి: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు పంటలను త్వరగా ఒబ్బిడి చేసుకోవాలని మండల ఏఓ జోకా అమృత శుక్రవారం సూచించారు. ఖరీఫ్ వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలన్నారు. కళ్లాల్లో ధాన్యం ఉంటే ఆర్బీకేల ద్వారా మిల్లులకు పంపించుకోవాలన్నారు. తేమ శాతం 17 కన్నా తక్కువ ఉంటే క్వింటాల్‌కు కేజీ తగ్గించి కొనుగోలు చేస్తారని తెలిపారు.

లక్ష తులసి పూజ

ప్రత్తిపాడు: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు తోటవీధిలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారికి శుక్రవారం లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకుడు గోపాలకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమార్చనలు, అనంతరం శాంతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి చిలకమర్తి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని గ్రామోత్సవం

ఏలేశ్వరం: మండలపరిధిలోని సిరిపురంలో శుక్రవారం సత్యదేవుని గ్రామోత్సవం వైభవంగా జరిగింది. సత్యదీక్షా ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు ఆధ్వర్యంలో స్వామివారి చిత్రపటంతో భజనలు చేస్తూ గ్రామంలోని పలువీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ సత్యదీక్షలు ఈ నెల 4వ తేదీతో ముగుస్తాయన్నారు. అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానంలో ఇరుముడులు సమర్పించి దీక్ష విరమిస్తామని తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

గోకవరం: వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్సై రాంబాబునాయక్ శుక్రవారం తెలిపారు. గోకవరానికి చెందిన గుడిసె మేరీ సుశీల గత నెల 27న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇప్పటి వరకు బంధువులు, తెలిసిన వారి ఇంటి వద్ద ఆచూకీ కోసం గాలించినా లభ్యం కాకపోవడంతో ఆమె భర్త అబ్బులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94409 04830 నంబర్‌కు సమాచారం అందించాలని ఏఎస్సై కోరారు.

గోకవరంలో..

గోకవరం: వ్యక్తి అదృశ్యంపై గోకవరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. సీతానగరం మండలం వంగలపూడికి చెందిన నల్లల సూరిబాబు గత నెల 30న తాపీ పనికి గోకవరం మండలం తిరుమలాయపాలెం వచ్చాడు. అదేరోజు పని ముగించుకుని రాజమహేంద్రవరం వెళతానని చెప్పి తిరిగి రాలేదు. అతను తన సొంతింటికి కూడా రాకపోవడంతో అతని కుమారుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు హెచ్‌సీ శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సూరిబాబు ఆచూకీ తెలిసిన వారు 94409 04830 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

అంగన్‌వాడీల ఆధునీకరణ

శంఖవరం: నాడు–నేడు పథకం ద్వారా అంగన్‌వాడీ భవనాలను ఆధునీకరించనున్నట్టు ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది, నాడు–నేడు కమిటీ సభ్యులకు శుక్రవారం ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ముగ్గురు చిన్నారుల తల్లులు కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. శంఖవరం మండలంలో 16, రౌతులపూడి మండలంలో 28 అంగన్‌వాడీ భవనాలను ఆధునీకరిస్తామని తెలిపారు.

విస్తృతంగా ఎస్‌ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేయగా మరొకరు పరారయ్యారన్నారు. శంఖవరం మండలం వజ్రకూటంలో సారాబట్టీలపై దాడి చేసి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ కేసులో కత్తిపూడి గ్రామానికి చెందిన బూరా నాగబాబు పరారయ్యాడు. ఏలేశ్వరం మండలం సిరిపురంలో పది లీటర్ల సారాతో కోట బాలరాజును అరెస్టు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ సెబ్ సీఐ పి.సునీల్‌కుమార్, ఇంటిలిజెన్స్ సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్ తెలిపారు.

ఉత్సాహంగా నృత్య పోటీలు

తుని: రోటరీక్లబ్ యువజనోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన నృత్య పోటీలు అందరినీ అకట్టుకున్నాయి. స్థానిక రెడ్ కాన్వెంట్ వీధిలోని రోటరీ హాలులో విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించారు. 6 నుంచి పదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు తమ డ్యాన్సులతో అలరించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని రోటరీక్లబ్ కార్యదర్శి కిశోర్‌రెడ్డి తెలిపారు.

బీజేపీ సమావేశం

జగ్గంపేట: స్థానిక సాహితీ స్కూల్‌లో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుల సమావేశం జరిగింది. కాకినాడలో ఈ నెల 6న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశం విజయవంతం, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చించారు. బీజేపీ జగ్గంపేట అసెంబ్లీ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- పలు గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్

కిర్లంపూడి/గండేపల్లి/జగ్గంపేట: చట్ట సభల్లో వెనుకబడిన వర్గాలకు స్థానం కల్పించి సామాజిక న్యాయం చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని ముక్కొల్లులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిలో పార్టీ జెండాను ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, మేడిబోయిన నాగార్జునతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గడపగడపకూ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. తోట నరేంద్ర, తోట బాబ్జీ, సొసైటీ అధ్యక్షుడు చదలవాడ బాబీ, దోమాల గంగాధర్, పెంటకోట నాగబాబు పాల్గొనారు.

గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో..

గండేపల్లి మండలంలోని పి.నాయకంపల్లి, జగ్గంపేట మండలం సీతానగరంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, యర్రంపాలెం గ్రామ సచివాలయ కన్వీనర్ నిమ్మలపూడి శ్రీహరి, ఎంపీడీఓ రామన్, ఈఓఆర్డీ మూర్తి పాల్గొన్నారు.

జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు

గోకవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సచివాలయంలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. పలువురికి కొండపోడుకు పత్రాలను, ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, గుమ్మళ్లదొడ్డి సర్పంచ్ సరకణం రామలక్ష్మి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, నరాలశెట్టి నర్సయ్య పాల్గొన్నారు.



ముక్కొల్లులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

పేదలకు ఆర్థిక భరోసా

ఏలేశ్వరం: రాష్ట్రంలో పేదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆర్థిక భరోసా లభిస్తుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా పార్థసారథి అన్నారు. మండలంలోని తిరుమాలిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ప్రారంభించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండల కో ఆప్షన్ సభ్యుడు పసల నాగేశ్వరరావు, సర్పంచ్ సూతి ప్రసాద్, నీరుకొండ సత్యనారాయణ, చిక్కాల లక్ష్మణరావు పాల్గొన్నారు. ఏలేశ్వరం 9 సచివాలయం పరిధిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు.

ప్రత్తిపాడు: గ్రామంలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, జేసీఎస్ మండల కన్వీనర్ రామిశెట్టి చినబాబు తదితరులు సచివాలయం–3లో సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. తొలుత పార్టీ పతాకాన్ని పార్టీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పార్టీ నాయకులు బెహరా దొరబాబు, ఆకుల వీరబాబు, పినిశెట్టి ప్రకాశ్, చెలంకూరి రాజబాబు, గుడాల వెంకటరత్నం, తాతపూడి బుజ్జి, వానపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే లక్ష్యం

రౌతులపూడి: స్థానిక సచివాలయం–1 పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ప్రత్తిపాడు ఏఎంసీ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కటారి అర్జనమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వి.భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, పార్టీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుని: పట్టణంలోని 12, 17, 18 వార్డులకు సంబంధించి శుక్రవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని 9వ సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఎగుర వేశారు. గత నాలుగున్నర ఏళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనులకు సంబంధించిన ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ప్రజలకు ప్రభుత్వ పరంగా చేకూరిన లబ్ధిని వివరించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, జేసీఎస్ కన్వీనర్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు బుడ్డిగ వెంకట దారేష్, అల్లాడ దివాణం, నార్ల భువన సుందరి, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు పోలసానపల్లి పద్మ, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ బుచ్చియ్యపేటలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ వివరాలను తెలిపే డిజిటల్ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలిలో పార్టీ జెండాను వైస్ ఎంపీపీ నాగం గంగబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గాబు రాజు, పార్టీ నాయకులు కొయ్యా మురళి, దడాల విజయ్, అంగుళూరి సుశీల, మండల సమన్వయ కమిటీ సభ్యుడు బెక్కం చంద్రగిరి, పార్టీ మండల కన్వీనర్ బద్ది నూకరాజు, యాదాల చక్రి, అంబుజాలపు అప్పలరాజు, గంగిరి అడివియ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

శంఖవరం: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. మండలంలోని నెల్లిపూడిలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయంలో సంక్షేమ, అభివృద్ధి పనులకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేశారు. గ్రామ ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీను పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గృహసారథులు, సచివాలయం కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ నరాల శ్రీలత, వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నరాల తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.



తునిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరించిన చైర్‌పర్సన్ సుధారాణి, నాయకులు



తిరుమాలిలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నెల్లిపూడిలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు, నాయకులు

సీఎం జగన్‌కు మరో అవకాశం ఇవ్వండి



పాతకొట్టాంలో మా నమ్మకం నువ్వే జగనన్న ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న నాయకులు

కోటనందూరు: అభివృద్ధి, సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్న సీఎం జగన్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు కోరారు. మండలంలోని పాతకొట్టాంలో శుక్రవారం లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి సంక్షేమ పథకాల బోర్డు, పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇంటింటా పర్యటించి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పసగుడుగుల వరహాలు, ఎంపీటీసీ దొగ్గా రామకృష్ణ, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తంచన్‌గా పింఛన్



కాకినాడ జీజీహెచ్‌లో నాగమణికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కుమారి



ఏలేశ్వరంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మీనాక్షి, ఏఎంసీ డైరెక్టర్ విజయ్‌కుమార్

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. తెల్లవారుజాము నుంచే గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల సొమ్ము అందజేశారు. ఏలేశ్వరం మండల వ్యాప్తంగా తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నియోజవర్గంలో 38,888 మందికి వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్లు అందజేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి నెలా ఇంటికే తంచన్‌గా పింఛన్ అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

70 శాతం పింఛన్ల పంపిణీ

ప్రత్తిపాడు: మండలంలో తొలిరోజు శుక్రవారం 70 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. మండలంలోని 23 గ్రామ సచివాలయాల పరిధిలో 11,947 మంది పింఛనుదారులుండగా 8,363 మందికి వలంటీర్లు పింఛన్లు బట్వాడా చేశారన్నారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

తొండంగి: మండలంలోని ఏవీ నగరం గ్రామానికి చెందిన కాకాడ నాగమణి రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె వితంతు పింఛనుదారు కావడంతో గ్రామ వలంటీర్ కాకాడ కుమారి శుక్రవారం సొంత ఖర్చులతో కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లి ఫింఛన్ నగదు అందజేసింది. వలంటీర్ కుమారిని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి, ఎంపీడీఓ పసపులేటి సతీష్ తదితరులు అభినందించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మొత్తం 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఆయుష్మాన్ భారత్‌పై అవగాహన

ప్రత్తిపాడు: ఆయుష్మాన్ భారత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయుష్మాన్ భారత్ యాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్‌బాబు మాట్లాడుతూ మండలంలో 39,174 రైస్ కార్డుదారులు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌కు రైస్ కార్డు దారులంతా అర్హులేనన్నారు. ఈ పథకం కింద భారత దేశంలో ఎక్కడైనా కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకూ వైద్య సహాయం పొందవచ్చన్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాలపై ఆరోగ్యమిత్ర కొల్లా రమేష్ అవగాహన కల్పించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

తుని రూరల్: ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ జీవీవీ వర ప్రసాద్ సూచించారు. మండలంలోని దొండవాకలో శుక్రవారం ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు రైతులకు లాభసాటిగా ఉందన్నారు. సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వందశాతం రాయితీపై హెక్టార్‌కు రూ.29 వేలు విలువ చేసే 193 మొక్కలను అందిస్తోందన్నారు. మొక్కలను సంరక్షించేందుకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.5250 చొప్పున రూ.21 వేలు ఇస్తోందన్నారు. అంతర పంటలను ప్రోత్సహించేందుకు ఏటా రూ.5250 చొప్పున ఇస్తారని తెలిపారు. ఆయిల్‌పామ్ తోటల్లో డ్రిప్ ఇరిగేషన్ పరికరాల ప్రయోజనాలు, రాయితీలను వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు లంక సత్యనారాయణ, వీహెచ్‌ఏ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీఎంఐపీ జిల్లా అధికారి వరప్రసాద్

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏలేశ్వరం: పట్టణంలోని వేంకటేశ్వర ఫంక్షన్ హాలులో శుక్రవారం విఘ్నేశ్వరా తాపీ పనివార్ల సంక్షేమ సంఘం నూతన కార్యకర్గ ఎన్నిక జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ఎస్. నాగశంకర్, ఉపాధ్యక్షుడిగా దనేడి చిన్ని, కార్యదర్శిగా పలికెల శ్రీను, సహాయ కార్యదర్శిగా శిడగం శ్రీను, కోశాధికారిగా గెద్ద శ్రీనులను ఎన్నుకున్నారు. వీరితో పాటు గౌరవాధ్యక్షులుగా కర్రోతు మన్నియ్య, పెమ్మాడ కొండబాబు, గుసిడి శివ, పతివాడ సత్యనారాయణ, ఎల్లంశెట్టి రాముతో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం మెయిన్‌రోడ్, బాలాజీచౌక్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అధిక సంఖ్యలో తాపీ పని కార్మికులు పాల్గొన్నారు.



తాపీ పనివార్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గ సభ్యులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ప్రత్తిపాడు: ఆధ్యాత్మికతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడులోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజయోగ శిక్షణాలయం నూతన భవన నిర్మాణానికి ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా జీవించేందుకు ఓం శాంతి శాఖలు పని చేస్తున్నాయన్నారు. రాజయోగ శిక్షణాలయం నిర్మాణంలో తాను భాగస్వామ్యం వహిస్తానంటూ తన సొంత నిధులు రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, బ్రహ్మకుమారీలు శ్రీదేవీ బెహన్, తులసి, లక్ష్మి, సుధ, మినర్వా విద్యాసంస్థల అధినేత డీవీఎస్ రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్ర ప్రసాద్

సామాజిక తనిఖీ ప్రజా వేదిక

కిర్లంపూడి: మండలంలో 2022–2023 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి సామాజిక తనిఖీ ప్రజా వేదికకు హాజరై గ్రామాల్లో గతేడాది జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల వారీగా జరిగిన పనులపై ఆరా తీశారు. గత నెల 17 నుంచి 30 వరకు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో లోపాలు, మొక్కల లెక్కలు, మస్టర్లలో తేడాలు వంటి పలు సమస్యలను డీఆర్పీలు డ్వామా పీడీ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, సర్వశిక్షా అభియన్, పశువైద్య శాఖ, సెర్ప్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల్లో జరిగిన 861 పనులకు గాను సుమారు రూ.11.84 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈజీఎస్, సీఎస్‌ఏ, పంచాయతీ రాజ్ శాఖల్లో పలు అవకతవకలు జరిగినట్లు గుర్తించి రూ.38,326 సిబ్బంది నుంచి రికవరీకి ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు జరిగినట్టు సర్పంచ్ మహేంద్రాడ శ్రీలిత, మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు డ్వామా పీడీ దృష్టికి తీసుకురాగా వాటిపై విచారణకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ భానుప్రకాష్, డీఆర్‌డీఏ భరత్, హెచ్‌ఆర్ మేనేజర్ రాజేష్, ఈఓపీఆర్డీ మార్కెండేశ్వరరావు, ఏపీఓ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ

రౌతులపూడి: గ్రామాల్లోని అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బి.భీమారావు సూచించారు. స్థానిక కళాశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం ఆయన రౌతులపూడిలో ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక సినిమా సెంటర్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రజలను చైతన్యవంతులను చేశారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకునే విధానం, ఫారం –6, ఫారం–7 ,ఫారం–8 ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఏఎస్ఓ వెంకటరమణ, వీఆర్ఓ గోవిందు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనసమారాధనలు

తుని: స్థానిక గెద్దమూరి తాతారావు పామాయిల్ తోటలో శుక్రవారం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.సత్యవతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్తిమాసంలో అందరూ ఒకచోట కలిసి తమ అనుభవాలను పంచుకోవడం ఆనందంగా ఉందని ఎంపీ సత్యవతి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి. అనంతరం గౌరీ సేవా సంఘం సభ్యులు ఎంపీ సత్యవతిని ఘనంగా సత్కరించారు. కేంద్ర గౌరీ సంఘం అధ్యక్షులు బుద్ద శివాజీ, గౌరవాధ్యక్షులు చదరం శివాజీ, అధ్యక్షుడు కోరుబిల్లి సత్తిబాబు, కార్యదర్శి పెంటకోట సురేష్, కోశాధికారి బోడ్డేటి నానాజీ, వేగి సత్యనారాయణ, ఆడారి సంతోషకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని మల్లంపేటలో శుక్రవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామ శివారులోని మామిడితోటలో వైఎస్సార్ సీపీ నాయకుడు పోలుపర్తి తాతాజీ ఆధ్వర్యంలో వన సమారాధన ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. తొలుత ఉసిరి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు, శాంతిఆశ్రమం తదితర గ్రామాల్లో శుక్రవారం కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. ధారపల్లి, తోటపల్లి, యరకంపాలెం జలపాతాలకు సందర్శకులు పోటెత్తారు. అడ్డురోడ్డు జంక్షన్‌లోని మామిడి తోటలో ప్రత్తిపాడు గోకవరపు వీధి యూత్ ఆధ్వర్యంలో భారీ వనసమారాధన నిర్వహించారు.

పి.నాయకంపల్లిలో..

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో శుక్రవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.



తుని వన సమారాధనలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి

అవగాహనతో మహమ్మారిని తరిమేద్దాం



పాతకొట్టంలో మానవహారంగా ఏర్పడిన అధికారులు, వైద్య సిబ్బంది

తుని/ఏలేశ్వరం/గోకవరం/ తుని రూరల్/శంఖవరం/తొండంగి/గండేపల్లి/ప్రత్తిపాడు రూరల్/కోటనందూరు: ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తునిలో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సాల్మాన్‌రాజు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 35 మంది వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషియన్ కిట్లు అందజేశారు. ప్రత్తిపాడులో గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రశాంతి నర్సింగ్ స్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోటనందూరు మండలం పాతకొట్టాంలో ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏలేశ్వరం పట్టణంలో మండల వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ సిబ్బంది ర్యాలీ చేశారు. అనంతరం బాలాజీచౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



వి.కొత్తూరులో ఎయిడ్స్ ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు